# సాధించే వరకు నిద్రపోను

న్యూస్‌టుడే, ఒంగోలు, ఒంగోలు పట్టణం

'నేను రాజీ పడను. అనుకున్నది సాధించే వరకు నిద్రపోను. మీ(రైతులు) కోసం పోరాడతాను. గోధుమతో సమానంగా వరికి మద్దతు ధర కేంద్రం ఇచ్చే వరకు ఉద్యమం ఆగదని' తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఏరువాకలో భాగంగా రెండో రోజు టంగుటూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ మద్దతు ధరపై చేపట్టిన తమ ఆందోళన ఆగబోదని స్పష్టం చేశారు. ఏరువాకలో భాగంగా గురువారం ఉదయం 10.30 గంటలకు మార్టూరులో మొదలైన ఆయన పర్యటన శుక్రవారం ఉదయం 7.50 గంటలకు ఒంగోలు చేరుకుంది. ఒంగోలులోని ఎన్నెస్పీ అతిథి గృహానికి చేరుకున్న ఆయన గంటలోనే మళ్లీ సిద్ధం అయ్యారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో కొద్దిసేపు భేటీ అయ్యారు. అక్కడ నుంచి జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొని మళ్లీ పర్యటన మొదలు పెట్టారు. టంగుటూరు, కొండపి, జరుగుమల్లి, కందుకూరు మండలాల్లో పర్యటించారు. అడుగడుగునా జనం బారులు తీరి నిలిచారు. గ్రామాలు అన్నీ పక్క పక్కనే ఉండడంతో అయిదారు నిమిషాలకొక దఫా ఆగాల్సి రావడంతో ఆయన కాన్వాయ్ వేగంగా ముందుకు సాగడం కష్టమైంది.

## మామిడి కథ

మామిడి బీజం నాటాం. నీరు పోశాం. ఎరువు వేశాం. ఆరు సంవత్సరాల్లో అది మానైంది. ఫలాలు ఇస్తోంది.. చెట్టును ఫలాల స్థాయికి తీసుకురావడానికి తాము ఎంతో కష్టపడ్డామని, కాంగ్రెస్ వాళ్లు వాటిని తింటూ ప్రజల గురించి పట్టించుకోవడంలేదని చంద్రబాబు ఆరోపించారు. విద్యుత్తు రంగం పురోగతికి కూడా తమ కృషే కారణమని అన్నారు.

## కూలీలకు చంద్రబాబు పలకరింపు

జరుగుమల్లి: రోడ్డుషోలో భాగంగా తూమాడు గ్రామ ఎస్సీ కాలనీ దగ్గర పచ్చాకు అల్లుతున్న కూలీలను తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పలకరించి వారి సాధక బాధకాలను తెలుసుకున్నారు. పచ్చాకు ఎలా అల్లుతారో చూపమన్నారు. ఎన్ని గంటలు పనిచేస్తున్నారు, కూలీ ఎంత ఇస్తున్నారు, సరిపోతుందా అని అడిగారు. అనంతరం ఖాళీ బ్యారన్‌లోని గొట్టాలను పరిశీలించారు. పొగాకును పరిశీలించి దాని నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.

## చంద్రబాబుకు వీడ్కోలు

రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించిన తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం రాత్రి సింగరాయకొండలో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కి హైదరాబాద్ వెళ్లారు. కందుకూరు సభలో మాట్లాడిన అనంతరం సింగరాయకొండలో పోలీసుస్టేషన్ వద్ద కొద్దిసేపు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం హైదరాబాదు బయలుదేరిన చంద్రబాబుకు జిల్లా పార్టీ అధ్యక్షులు కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ శిద్దా రాఘవరావు, నియోజకవర్గ ఇన్‌చార్జులు గరటయ్య, కాశిరెడ్డి, దివి శివరాం, డేవిడ్‌రాజు, సాయికల్పన, దామచర్ల జనార్దన్, పార్టీ ప్రధాన కార్యదర్శి కె.ఆదెన్న, రాష్ట్ర పార్టీ కార్యదర్శి గొడుగుల గంగరాజు, ఎం.ఎం.కొండయ్య, శిరిగిరి రంగారావు, మంత్రి శ్రీనివాసరావు తదితరులు వీడ్కోలు పలికారు.